

## జియోమార్ట్ ప్రచారకర్తగా మహీంద్రసింగ్ ధోనీ

ముంబై, అక్టోబర్ 6: రిలయన్స్ రిటైల్ సంస్థ జియోమార్ట్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ క్రికెటర్ మహీంద్ర సింగ్ ధోనీని నియమితుల య్యారు. మరోవైపు ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని సంస్థ జియోఉత్సవ్ పేరుతో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ నెల 8న ప్రారంభం కానున్న ఈ ఆఫర్ కింద 50 శాతం నుంచి 80 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్టు తెలిపింది. ఎలక్ట్రానిక్స్ పరికరాలపై 70 శాతం రాయితీ ఇస్తున్న సంస్థ..స్మార్ట్‌ఫోన్లపై రూ.15 వేల వరకు ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలు కల్పిస్తోంది.

### జియో, ఎయిర్‌టెల్ ప్రత్యేక ప్లాన్లు

మరోవైపు, క్రికెట్ ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని జియో, ఎయిర్‌టెల్‌లు ప్రత్యేక ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. డిస్నీ+హాట్‌స్టార్ కలుపుకొని పలు ప్రీపెయిడ్ ప్లాన్లను విడుదల చేసిన జియో..ఎయిర్‌టెల్ రెండు ప్లాన్లు ప్రవేశపెట్టింది. రూ.99కే రెండు రోజుల పాటు అన్‌లిమిటెడ్ డాటాతో పాటు రూ.49కే రోజుకు 6జీబీ డాటాను ఆఫర్ చేస్తున్నది. జియో మాత్రం నెల, త్రైమాసికపు, వార్షిక ప్లాన్లలో డాటా, అన్‌లిమిటెడ్ వాయిస్, డిస్నీ+ హాట్‌స్టార్ మొబైల్‌ను అందిస్తున్నది.

## పీట్రాన్ ప్లాంట్ విస్తరణ

హైదరాబాద్, అక్టోబర్ 6: పీట్రాన్.. హైదరాబాద్‌లో ఉన్న ప్లాంట్‌ను విస్తరిస్తున్నది. ప్రస్తుతం నాచారం వద్ద 35 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అసెంబ్లింగ్ యూనిట్‌ను 80 వేల చదరపు అడుగుల విస్తీర్ణానికి పెంచుతున్నట్లు కంపెనీ ఫౌండర్, సీఈవో అమీన్ ఖవాజా తెలిపారు. ప్రస్తుతం ఈ యూనిట్‌లో 350 ఉద్యోగులు పనిచేస్తుండగా, వచ్చే ఏడాదికాలంలో ఈ సంఖ్యను 1,000కి పెంచుకోనున్నట్లు చెప్పారు. వ్యాపార విస్తరణకు అవసరమైన నిధుల్లో రూ.30 కోట్లను పెట్టుబడిదారుల నుంచి సేకరించనున్నట్టు ఆయన ప్రకటించారు.

# అధిక ధరలతో ముప్పే

మొదటిపేజీ తరువాయి...

నమోదు కావచ్చన్న ఆర్బీఐ.. జూలై, ఆగస్టులతో పోల్చితే సెప్టెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గుముఖం పట్టవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దిగొస్తున్న కూరగాయల ధరలతోపాటు తగ్గిన వంటగ్యాస్ ధరలతో ద్రవ్యోల్బణం శాంతించవచ్చనీ పేర్కొన్నది. అయినప్పటికీ ద్రవ్యోల్బణం లక్ష్యానికి దగ్గరగా ధరల్ని తెచ్చేందుకు బాండ్ల విక్రయం ద్వారా తమ కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగిస్తామని ఆర్బీఐ సంకేతాలిచ్చింది.

### వరుసగా నాల్గోసారి..

ఇక వరుసగా నాల్గోసారి కీలక వడ్డీరేట్ల జోలికి సెంట్రల్ బ్యాంక్ వెళ్లలేదు. రెపోరేటు, రివర్స్ రెపోరేటును యథాతథంగానే ఉంచాలని ఆరుగురు సభ్యులున్న మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. దీంతో రెపోరేటు 6.5 శాతం వద్ద, రివర్స్ రెపోరేటు 3.35 శాతం వద్దే ఉన్నాయి. కరోనా దెబ్బకు కుదేలైన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్సాహపర్చేందుకు రెపోరేటును వరుసగా తగ్గిస్తూపోయిన ఆర్బీఐ.. విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టేందుకు మళ్లీ పెంచుతూ వచ్చింది. ఈ క్రమంలోనే గత ఏడాది మే నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రెపోరేటును ఆర్బీఐ ఏకంగా 250 బేసిస్ పాయింట్లు పెంచిన విషయం తెలిసిందే. దీంతో కరోనాకు ముందున్న స్థాయిని మించిపోయింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) మొదలు రెపోరేటును స్థిరంగానే ఉంచుతూ వస్తోంది.

### వృద్ధిరేటుపై..

ఈ 2023-24కుగాను దేశ జీడీపీ అంచనానూ ఈసారి ఆర్బీఐ మార్చలేదు. గత అంచనానే కొనసాగిస్తూ 6.5 శాతంగా ప్రకటించింది. అయితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మందగమనం చోటుచేసుకున్నప్పటికీ భారత వృద్ధిరేటుపై విశ్వాసం కనబర్చిన ఆర్బీఐ.. ప్రపంచ వృద్ధికి నవ చోదక శక్తిగా భారత్ ఆవిర్భవిస్తుందన్న ఆశాభావాన్నీ వెలిబుచ్చింది. ఇక ఇప్పటికీ వృద్ధికి మద్దతిచ్చే ద్రవ్య విధానం, ద్రవ్యోల్బణం అదుపునకే పెద్దపీట వేస్తామని ఆర్బీఐ చెప్పింది. తదుపరి ద్రవ్యసమీక్ష డిసెంబర్ 6-8 తేదీల్లో ఉండనున్నది.




శుక్రవారం ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ద్రవ్య సమీక్ష సందర్భంగా డిప్యూటీ గవర్నర్లతో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

- **పేమెంట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (పీఐడీఎఫ్) పథకం కిందికి పీఎం విశ్వకర్మ. పథకం కాలపరిమితి మరో రెండేండ్లు పెంపు.**
- **కరోనా ఆంక్షలతో షాపింగ్, ఇతరత్రా ఖర్చులను తగ్గించుకున్న ప్రజలు.. మళ్లీ ఖర్చులకు వెళ్తుండటంతో గృహస్తుల పొదుపు రేటు గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఐదు దశాబ్దాల కనిష్ఠానికి పడిపోయింది.**
- **ద్రవ్య లభ్యత నిర్వహణకుగాను ప్రభుత్వ సెక్యూరిటీల అమ్మకానికి ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలను వినియోగించుకునే వీలున్నది.**
- **ద్రవ్య నిర్వహణ చర్యల్లో భాగంగా శనివారం ఇంక్రిమెంటల్ క్యాష్ రిజర్వ్ రేషియో (ఐ-సీఆర్ఆర్)ను పూర్తిగా ఉపసంహరిస్తున్న ఆర్బీఐ. మార్కెట్‌లోకి సదరు నిధుల విడుదల.**


## రేపట్నుంచి ఆర్బీఐ ఆఫీసుల్లో 2వేల నోట్లు ఇవ్వొచ్చు: దాస్

*ఈ నెల 8 (ఆదివారం) నుంచి ఆర్బీఐ కార్యాలయాల్లో రూ.2వేల నోట్లను మార్చుకోవచ్చని ఆర్బీఐ గవర్నర్ దాస్ తెలిపారు. శనివారంతో రూ.2వేల నోట్ల మార్పిడికి ఆర్బీఐ ఇచ్చిన వారం రోజుల గడువు పొడిగింపు ముగుస్తున్నది. దీంతో ఇంకా రూ.2వేల నోట్లను మార్చుకోవాల్సినవారు ఎవరైనా ఉంటే సమీపంలోని ఆర్బీఐ కార్యాలయాలకు వెళ్లవచ్చని దాస్ సూచించారు. ఈ ఏడాది మే 19న రూ.2వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. వీటిని బ్యాంకుల్లో మార్చుకోవచ్చని సెప్టెంబర్ 30 వరకు గడువూనూ ఇచ్చిన సంగతి విదితమే. ఈ క్రమంలో మరో వారం రోజులు ఈ సౌకర్యాన్ని పొడిగించగా, శనివారంతో అది పూర్తవుతున్నది. ఇదిలావుంటే రూ.3.43 లక్షల కోట్ల విలువైన రూ.2వేల నోట్లు (87 శాతం) తిరిగొచ్చేశాయని దాస్ తెలిపారు. బ్యాంకుల్లోనే డిపాజిట్ అయ్యాయన్న ఆయన.. ఇంకా రూ.12,000 కోట్లు రావాల్సి ఉందన్నారు.*



కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగా ఉంచడం వృద్ధిదాయక చర్యే. పీఐడీఎఫ్‌లో పీఎం విశ్వకర్మ పథకాన్ని కలిపేయడం మంచి నిర్ణయం. చిన్నతరహా కళాకారులకు ప్రయోజనం చేకూరుతుంది.

**-దినేశ్ కుమార్ ఖారా, ఎస్బీఐ చైర్మన్**



కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడం వల్ల ఈ పండుగ సీజన్‌లో గృహ విక్రయాలకు ఆర్బీఐ జోష్‌నిచ్చినట్టైంది. ఎంతో మంది మదుపరులు స్థిరాస్తి కొనుగోలుకు ముందుకు రావడానికి వీలు కలిగింది. అయితే వచ్చే ద్రవ్యసమీక్షల్లోనైనా వడ్డీ రేట్లు తగ్గితే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**-బొమన్ ఇరానీ, క్రెడాయ్ అధ్యక్షుడు**

LIC HFL

ఆర్బీఐ నిర్ణయాలు అంచనాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. రెపోరేటును యథాతథంగా ఉంచి దేశ ఆర్థిక వ్యవస్థకు, వృద్ధిరేటుకు రిజర్వ్ బ్యాంక్ మద్దతిచ్చింది. స్థిరమైన వడ్డీరేట్లు మార్కెట్‌లో మరింత పోటీ వాతావరణాన్ని సృష్టించగలవు.

**-త్రిభువన్ అధికారి, ఎల్ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ సీఈవో**



ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయాలు ముందుగా ఊహించినట్టుగానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం కదలికల్ని నిశితంగా గమనిస్తున్న ఆర్బీఐ వైఖరి సరైనదే. త్వరలోనే ధరలు శాంతించి వృద్ధికి బాటలు పడుతాయని ఆశిస్తున్నాను.

**-శుభ్రకాంత్ పాండా, ఫిక్కీ అధ్యక్షుడు**



## వచ్చే ఏప్రిల్-జూన్‌లోనే తగ్గొచ్చు

వచ్చే ఏడాది ఏప్రిల్-జూన్‌లోనే వడ్డీరేట్లను ఆర్బీఐ తగ్గించే వీలుందని పలువురు ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ పరిశ్రమ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, ఆగస్టు నెలల్లో జరిపిన ద్రవ్యసమీక్షల్లో రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగా ఉంచిన విషయం తెలిసిందే. తాజా ద్రవ్యసమీక్షలోనూ అదే బాటలో రిజర్వ్ బ్యాంక్ నడిచింది. దీంతో వచ్చే రెండు ద్రవ్య సమీక్షల్లోనూ (డిసెంబర్, ఫిబ్రవరి) వడ్డీరేట్ల తగ్గింపు ఉండకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, పెరుగుతున్న ముడి చమురు ధరలు, అంతర్జాతీయంగా ఆహార సరఫరాలో ఇబ్బందులు ద్రవ్యోల్బణాన్ని ఇంకా ఎగదోయవచ్చని, కనుక ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) వడ్డీరేట్ల కోత కష్టమేనని క్రిసిల్ అంటున్నది.

# బుల్లెట్ గోల్డ్ లోన్స్ పరిమితి 4 లక్షలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: బుల్లెట్ రీపేమెంట్ స్కీమ్ కింద పట్టణ సహకార బ్యాంక్‌లు బంగారంపై ఇచ్చే రుణాల పరిమితిని రిజర్వ్ బ్యాంక్ రెట్టింపు చేసింది. గతంలో ఈ పరిమితి రూ.2 లక్షలు ఉండగా, ఇప్పుడు రూ.4 లక్షల వరకూ పెంచింది. అయితే 2023 మార్చి 31నాటికి ప్రాధాన్యత రంగ రుణాల లక్ష్యాలను (పీఎస్ఎల్) పూర్తిచేసిన సహకారం బ్యాంక్‌లకే ఈ పెంపు సదుపాయం వర్తిస్తుందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ చెప్పారు. ఇటీవల పట్టణ సహకార బ్యాంక్‌ల చీఫ్‌లతో సమావేశమైన దాస్..పీఎస్ఎల్ లక్ష్యాల్ని పూర్తిచేసిన బ్యాంక్‌లకు 'తగిన ప్రోత్సాహకాలు' ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజా రుణ వితరణ అవకాశాన్ని కల్పించారు. ఈ అవకాశాన్ని పొందిన బ్యాంక్‌లు పీఎస్ఎల్ లక్ష్యాలు, ఉప లక్ష్యాల సాధనను కొనసాగించాల్సి ఉంటుందని, ఈ అంశంపై సవివరమైన మార్గదర్శకాలను ప్రత్యేకంగా జారీచేయనున్నట్టు ఆర్బీఐ తెలిపింది.

### బుల్లెట్ గోల్డ్ లోన్ అంటే..

బంగారంపై తీసుకున్న రుణం కాలపరిమితి ముగిసినపుడే పూర్తిగా అసలు, వడ్డీ మొత్తాన్ని ఒకేదఫా చెల్లించే వీలును కల్పించేదే బుల్లెట్ రీపేమెంట్ ఆప్షన్. ఈఎంఐ షెడ్యూల్ పాటించడం, పాక్షిక చెల్లింపులు చేయడం వంటి ఆందోళనలు బంగారం రుణాలు తీసుకున్నవారికి ఉండవు. ఈ రుణంపై వడ్డీ రేటును ప్రతీ నెలా లెక్కిస్తారు. కానీ కాలపరిమితి ముగిసిన తర్వాత అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తే చాలు. బుల్లెట్ రీపేమెంట్ పూర్తిచేసినవారు తనఖా చేసిన బంగారాన్ని వెనక్కు తీసుకోవచ్చు లేదా రోలోవర్ చేసుకోవచ్చు. ఇప్పటివరకూ ఈ రుణాల గరిష్ఠ కాలపరిమితి 12 నెలలు. రోలోవర్ చేసుకుంటే చెల్లించిన మరుసటి రోజే కొత్త రుణాన్ని తీసుకోవచ్చు.

## వ్యక్తిగత రుణాలతో జాగ్రత్త

- **బ్యాంక్‌లను హెచ్చరించిన దాస్**

ముంబై, అక్టోబర్ 6: బ్యాంకింగ్ వ్యవస్థలో రిటైల్ అన్‌సెక్యూర్డ్ లోన్స్ (వ్యక్తిగత రుణాలు) శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటి ద్వారా ఆర్థిక స్థిరత్వం రిస్క్‌లో పడుతుందన్న ఆందోళనను ఆర్బీఐ వ్యక్తం చేసింది. పరపతి విధాన ప్రకటన సందర్భంగా గవర్నర్ దాస్ మాట్లాడుతూ పర్సనల్ లోన్స్‌తో ప్రస్తుతానికి ఎటువంటి సమస్యా లేదని, భవిష్యత్ రిస్కుల పట్ల బ్యాంకర్లు జాగురూకతతో వ్యవహరించాలనే లక్ష్యంతోనే తాము హెచ్చరిస్తున్నామన్నారు. 'మీరు జాగ్రత్తగా ఉండాలంటూ వారిని (రుణదాతలు) మేము కేవలం అప్రమత్తం చేస్తున్నాం. మీ కళ్లు, చెవులు తెరిచి ఉంచడమే కాదు. ముక్కు కూడా తెరవాలి. సంక్షోభం ఎక్కడ్నుంచి వస్తుందో వాసన పసిగట్టేందుకు' అని దాస్ సూచించారు. ఏదైనా బ్యాంక్‌లో సమస్య ఏర్పడితే ఆర్బీఐ సూపర్‌వైజర్లు నేరుగా అటువంటి ఆర్థిక సంస్థను పర్యవేక్షిస్తారన్నారు. ప్రస్తుతానికి బ్యాంక్‌లు, ఎన్బీఎఫ్‌సీలు స్థిరంగా ఉన్నాయని, జూన్ త్రైమాసికంలో స్థూల ఎన్పీఏల నిష్పత్తి మెరుగుపడిందన్నారు.

## సెమీ కండక్టర్ల విభాగంలోకి కేన్స్

దేశీయ ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ తయారీ సంస్థ కేన్స్ టెక్నాలజీ తాజాగా నూతన విభాగంలోకి అడుగుపెట్టబోతున్నది. మూడు దశాబ్దాలకు పైగా ఎలక్ట్రానిక్ పరికరాలను తయారుచేస్తున్న ఈ దిగ్గజ సంస్థ.. తాజాగా సెమీకండక్టర్ల తయారీ విభాగంలోకి ప్రవేశిస్తున్నది. ఇందుకు సంబంధించి తెలంగాణలో అవుట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లింగ్ అండ్ టెస్ట్(ఓశాట్), అసెంబ్లింగ్-టెస్టింగ్, మార్కెటింగ్ అండ్ ప్యాకేజింగ్(ఏటీఎంపీ) యూనిట్లను నెలకొల్పడానికి ముందుకొచ్చింది. ప్రస్తుతం సంస్థ ఆటోమోటివ్, ఇండస్ట్రీయల్, రైల్వే, మెడికల్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఐవోటీ వంటి రంగాలకు సంబంధించిన పరికరాలను ఉత్పత్తి చేస్తున్నది.

KAYNES TECHNOLOGY

ప్రారంభం: **1988**

ప్రధాన కార్యాలయం: **మైసూరు**

కీలక వ్యక్తులు: **సావిత్రి రమేశ్ (చైర్‌పర్సన్), రమేశ్ కన్నన్ (ఎండీ)**

సీఈవో: **రాజేశ్ శర్మ**

ఉద్యోగులు: **1,500**

ప్లాంట్లు: **8** సర్వీస్ సెంటర్లు: **2**

ఆదాయం: **రూ.676 కోట్లు (2022-23లో)**

కస్టమర్లు: **వైర్డ్ హెడ్‌సెట్స్, వైర్‌లెస్ స్టీరియో, స్మార్ట్‌వ్యాచ్, బ్లూటూత్ స్పీకర్లు, చార్జర్లు, వైర్‌లెస్ హెడ్‌సెట్**

## చిత్రం




రఘుబాబు, మాదాల రవి, సి.కల్యాణ్, సూర్యదేవర రాధాకృష్ణ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, దిల్ రాజు, సాయికిరణ్ యాదవ్ తదితరులు

## సినిమా పరిశ్రమకు ఏ కష్టమొచ్చినా ముందుంటా

**- మంత్రి తలసాని**

'మన ప్రియతమ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు సినిమా పరిశ్రమ సమస్యల పరిష్కారం పట్ల ఎప్పుడూ సానుకూలంగా ఉంటారు. ఆయన ఆశీర్వాదమే మనకు శ్రీరామరక్ష. సినిమా పరిశ్రమకు ఏ కష్టమొచ్చినా ముందుంటాను' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన జన్మదిన వేడుకలు తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 'నా పుట్టినరోజును ఇంత ఘనంగా నిర్వహించిన తెలుగు సినిమా పరిశ్రమకు కృతజ్ఞతలు. నన్ను దీవించడానికి వేలాదిగా అభిమానులు రావడం ఆనందంగా ఉంది. ఇంత మంది అభిమానాన్ని చూరగొనడం నా పూర్వజన్మసుకృతం. ఈ చక్కని ఆత్మీయ వాతావరణం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను' అన్నారు. తదనంతరం తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు తలసాని సాయికిరణ్ యాదవ్ తన తండ్రిపై రాయించిన ఓ ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన ఈ వేడుకల్లో చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు దిల్‌రాజు, ప్రముఖ నిర్మాతలు దామోదర ప్రసాద్, సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, సి.కల్యాణ్, నటులు రఘుబాబు, మాదాల రవి, చిత్రపురి కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్ దొర్రై, సినీ జర్నలిస్ట్ సంఘం తరపున సురేశ్ కొండేటి, లక్ష్మీనారాయణ, 24 క్రాఫ్ట్స్‌కు చెందిన సినీ కార్మికులు వేలాదిగా పాల్గొని తలసానిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



అల్లు అర్జున్

## రెండు భాగాలుగా

త్రివిక్రమ్, అల్లు అర్జున్.. ఈ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలన్నీ హిట్సే. ఆల్రెడీ ఇది హ్యాట్రిక్ కాంబినేషన్. వీరిద్దరి నాలుగో సినిమాకు కూడా రంగం సిద్ధమైన విషయం తెలిసిందే. సూర్యదేవర నాగవంశీ నిర్మించనున్న ఈ సినిమాను రెండు భాగాలు తెరకెక్కించాలని దర్శకుడు త్రివిక్రమ్ భావిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. కథ డిమాండ్ చేస్తున్న దృష్ట్యా ఈ సినిమాను రెండు భాగాలుగా తీయడం కరెక్టని త్రివిక్రమ్ నిర్మాతతో చెప్పారట. నాగవంశీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. 2025లో విడుదలయ్యే ఈ సినిమా, దర్శకుడిగా త్రివిక్రమ్‌కు తొలి పాన్ ఇండియా సినిమా అని చెప్పొచ్చు. ప్రస్తుతం బన్నీ 'పుష్ప-2'తో బిజీగా ఉన్నాడు. వచ్చే ఏడాది ఆగస్ట్ 15న 'పుష్ప-2' విడుదల కానుంది. ఆ తర్వాత ఈ క్రేజీ యస్ట్ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుంది.

## రోషన్ కనకాల 'బబుల్‌గమ్'

తెలుగుచలనచిత్ర పరిశ్రమలో పరిచయం అక్కర్లేని జంట రాజీవ్ కనకాల, సుమ కనకాల. రాజీవ్ నటుడిగా ప్రస్థానాన్ని సాగిస్తుంటే, సుమ తిరుగులేని వ్యాఖ్యాతగా సత్తా చాటుతున్నారు. త్వరలో వీరిద్దరి కుమారుడు రోషన్ కనకాల హీరోగా పరిచయం కానున్నాడు. సినిమా పేరు 'బబుల్‌గమ్'. మానసా చౌదరి కథానాయిక. క్షణం, కృష్ణ అండ్ హిజ్ లీల చిత్రాల దర్శకుడు రవికాంత్ పేరెపు ఈ సినిమాకు దర్శకుడు. మహేశ్వరి మూవీస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' రోషన్‌కి నా అభినందనలు. నటుడిగా తను మంచి స్థాయికి వెళ్లాలి. పరిశ్రమలో తనకంటూ ఓ స్థానాన్ని ఏర్పరచుకోవాలి' అంటూ శుభాకాంక్షలు అందించారు. అక్టోబర్ 10న ఈ సినిమాకు సంబంధించిన స్టోరీ గ్లింప్స్‌ని విడుదల చేస్తున్నామని మేకర్స్ తెలియజేశారు. ఈ చిత్రానికి కెమెరా: సురేశ్ రగుతు, సంగీతం: శ్రీచరణ్ పాకాల.







